క్లుప్తంగా

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న శ్రీశైలం

యాచారం: మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీశైలం శుక్రవారం నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. శ్రీశైలం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. దాతలు కూడా ముందుకు వచ్చి ఆర్థిక సహకారం అందజేస్తే విద్యార్థులు బాగా చదువుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డుసభ్యులు మల్లేశ్, జంగయ్య, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ లాజర్, గ్రామస్తులు గౌస్, ప్రవీణ్, అర్షద్, ఆడాల శివ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని రాంపూర్‌కు చెందిన శాంతమ్మ (56) అనారోగ్యంతో ఇటీవల మరణించింది. ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఫౌండేషన్ సభ్యులచే శుక్రవారం రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో శివ, నరేందర్‌గౌడ్, రాఘవేందర్‌యాదవ్, శ్రీశైలం, రాము తదితరులు పాల్గొన్నారు.

15వ వార్డులో కంటివెలుగు శిబిరం



కంటి పరీక్ష చేయించుకుంటున్న లక్ష్మణ్

ఆమనగల్లు: కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్ కోరారు. ఆమనగల్లు పట్టణంలోని 15వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం వారు ప్రారంభించారు. చూపు మందగించిన వారు కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మంజులాదేవి, సిబ్బంది నవీన్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే మైనార్టీలకు న్యాయం

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



ఎమ్మెల్యే కిషన్‌రెడ్డితో మైనార్టీ నాయకులు

యాచారం: బీఆర్ఎస్‌తోనే మైనార్టీలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామానికి చెందిన ముస్లిం సోదరులు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసారు. నల్లవెల్లి గ్రామంలో ముస్లింలకు ప్రత్యేకంగా శ్మశానవాటిక, ప్రహరీ నిర్మాణం కోసం ఎమ్మెల్యే రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారు. ముస్లింలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్, నాయకులు లక్ష్మీపతిగౌడ్, రవిగౌడ్, సమద్, అక్బర్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే

నక్కర్తమేడిపల్లి ప్రధాన రోడ్డుపై గుంత



యాచారం: నక్కర్తమేడిపల్లి గ్రామంలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సమీపంలో రోడ్డుపైన గుంత ప్రమాదకరంగా మారింది. నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాల గేట్ ముందు వాటర్‌లైన్ గేట్‌వాల్వ్ పై కప్పు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై కడ్తాల్ మండలం చరికొండ, పల్లెచల్కతండా, ముద్విన్ గ్రామాల ప్రయాణికులతో పాటు యాచారం మండల పరిధిలోని నానక్‌నగర్, తాడిపర్తి, గొల్లగూడ, పిల్లిపల్లి, కుర్మిద్ద తదితర గ్రామాల నుంచి ప్రయాణికులు యాచారం, మాల్ మార్కెట్లకు వెళ్లడానికి రాకపోకలు సాగిస్తారు. రోడ్డు పక్కనే గేట్‌వాల్వ్ గుంత ప్రమాదకరంగా ఉన్న విషయం తెలిసినా కూడా అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడం లేదు. కొద్ది రోజుల కిందే గ్రామంలో ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్‌ను కూడా ప్రారంభించారు. తరుచూ పోలీస్ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వెంటనే ప్రత్యేక శ్రద్ధ పెట్టి మృత్యుకుహరంగా మారిన గేట్‌వాల్వ్‌ను మూసేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సమాజ సేవే లక్ష్యంగా..

- 37 ఏళ్లు పూర్తిచేసుకున్న ఆమనగల్లు లయన్స్ క్లబ్
- ఉచిత నేత్ర, రక్తదాన, వైద్య శిబిరాలతో రికార్డు
- సేవలను విస్తృతం చేస్తామంటున్న సభ్యులు



లయన్స్ క్లబ్ భవనం వద్ద క్లబ్ సభ్యులు

ఆమనగల్లు: ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ప్రజాసేవలో 37 ఏళ్లు పూర్తిచేసుకుంది. అంతర్జాతీయ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటవుతున్న గ్రామీణ లయన్స్‌క్లబ్‌లలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అగ్రభాగాన నిలిచింది. సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలకు ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆదర్శంగా నిలిచింది.

1986లో ప్రారంభం...

ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌ను అంతర్జాతీయ లయన్స్ క్లబ్ అనుబంధంగా 1986లో 56 మంది సభ్యులతో ప్రారంభించారు. ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల, నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి, వెల్దండ, చారకొండ మండలాలకు చెందిన 220 మంది సభ్యులతో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ పనిచేస్తుంది. రాష్ట్రంలోని సేవా కార్యక్రమాల నిర్వహణలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అగ్రస్థానంలో నిలిచింది. కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలతో కూడిన 320–ఎ లయన్స్‌క్లబ్ జిల్లా పరిధిలో 86 లయన్స్‌క్లబ్‌లు ఉండగా ఆమనగల్లు లయన్స్‌క్లబ్ నుంచి నలుగురు లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌లుగా పదవులు నిర్వహించడం ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఘనతగా చెప్పవచ్చు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌లుగా రూప్‌కరణ్‌రెడ్డి, చెన్నకిషన్‌రెడ్డి, జూలూరి రమేశ్‌బాబు, నరేందర్‌రెడ్డి పనిచేసి లయన్స్‌క్లబ్ సేవలను విస్తృతం చేశారు.

ఏనుగొండలో కంటి ఆస్పత్రి ఏర్పాటు..

మహబూబ్‌నగర్ జిల్లా ఏనుగొండలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రాంరెడ్డి కంటి ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. ఈ ఆస్పత్రిలో ప్రతి ఏటా 15వేల కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి చైర్మన్ డా.వి.దామోదర్‌రెడ్డి తెలిపారు. గత 3 దశాబ్దాలుగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తూ వేలాదిమందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు.

వృద్ధాశ్రమం, బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు..

కడ్తాల సమీపంలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమం ఏర్పాటు చేశారు. వృద్ధాశ్రమం ఏర్పాటు కోసం కడ్తాలకు చెందిన లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి రూ.కోటి విలువ చేసే ఎకరా భూమిని ఉచితంగా అందించారు. అంతర్జాతీయ లయన్స్‌క్లబ్ సహకారంతో రూ.1.10 కోట్లతో వృద్ధాశ్రమం నిర్మించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ భవనం నిర్మించారు. ఇందులో ఉచితంగా డయాగ్నిక్ సెంటర్ ఏర్పాటు చేసి మధుమోహ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే హైదరాబాద్‌లోని మీర్‌పేటలో ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇతర క్లబ్‌ల సహకారంతో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా రక్తదాన శిబిరాలు నిర్వహించి రక్తం సేకరిస్తున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా రక్తం అందిస్తున్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలు...

ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 150 బస్సు షెల్టర్లు, 400 ప్రభుత్వ పాఠశాలలు, మినీ వాటర్‌ట్యాంక్‌లు నిర్మించారు. గ్రామీణ ప్రాంతాల్లో మెగా వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కల పెంపకం చేపట్టారు. ఇటీవల వీల్స్ ఆన్ మీల్స్ అనే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించి పేదలకు ఉచితంగా అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కడ్తాల మండల కేంద్రంలో గత నెలరోజులుగా చెన్నకిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత అంబలి కేంద్రం నిర్వహిస్తున్నారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య సదస్సులు నిర్వహిస్తున్నారు. ప్రతి ఏటా ఉత్తమ ఉపాధ్యాయులు, డాక్టర్లు, జర్నలిస్టులను సన్మానిస్తున్నారు. భవిష్యత్‌లో సేవలను విస్తృతం చేస్తామన్నారు.

ఉచితంగా వైద్య సేవలు



ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు సేవలు అందిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నాం. అవసరమైనవారికి ఉచితంగా మందులు ఇస్తున్నాం. కంటి శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి ఏనుగొండలోని రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తున్నాం.

– డాక్టర్ దామోదర్‌రెడ్డి, కంటి ఆస్పత్రి చైర్మన్

అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి



ఆమనగల్లు లయన్స్‌క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతిపొందింది. గ్రామీణ లయన్స్ క్లబ్‌లలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ పెద్దఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ సభ్యుల సహకారంతో ఇది సాధ్యమైంది. 320–ఎ జిల్లాలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌ను ప్రథమస్థానంలో నిలుపుతాం.

– జి.చెన్నకిషన్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్

విస్తృతం చేస్తాం



ఆమనగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. నిరుపేదలకు సేవలు అందించడమే క్లబ్ ప్రధాన లక్ష్యం. భవిష్యత్‌లో క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తాం.

– పాషా, పీఆర్ఓ, ఆమనగల్లు లయన్స్‌క్లబ్

'రాచకాల్వపై కాజ్‌వే నిర్మించండి'

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులోకి నీరొచ్చే రాచకాలువపై కాజ్‌వే నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బూడిద రాంరెడ్డి కోరారు. ఎల్మినేడులోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. కాజ్‌వే లేకపోవడంతో కాల్వలో పెద్ద లారీ పడిపోయిందని ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే.. పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కి ఫోన్ చేసి శనివారం సంఘటనా స్థలానికి వెళ్లి కాజ్‌వేకి అవసరమైన ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

చౌదర్‌పల్లి వన నర్సరీ పరిశీలన

యాచారం: సంవృద్ధి వర్షాలు కురిసిన వెంటనే హరితహారం మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామంలో శుక్రవారం ఎంపీడీఓ నర్సరీని సందర్శించారు. మొక్కలు నాటడం, సంరక్షణ ప్రణాళికలపై సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు సూచించారు. ప్రజలందరినీ హరితహారంలో భాగస్వాములు చేయాలన్నారు.

'కోర్టు ఆదేశాలు బేఖాతరు'

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని ఆదర్శనగర్ రాయపోల్ రోడ్డులోని 4, 5 వార్డుల్లో దళితుల ఇళ్లు కూల్చివేస్తున్నారంటూ మున్సిపల్ అధికారులపై ఎస్సీ,ఎస్టీ కమిషన్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ ఇండ్ల కూల్చివేతలపై హైకోర్టు స్టే విధించినప్పటికీ బేఖాతారు చేస్తున్నారని ఆయా కాలనీవాసులు మండిపడుతున్నారు. కూల్చివేతలను నిలిపివేసేలా చర్యలు చేపట్టాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. దయానంద్ తదితరులు ఉన్నారు.

ఉప్పరాశి కుంట సమస్య పరిష్కరించండి



విద్యార్థులతో కలిసి మురుగు కాల్వను పరిశీలిస్తున్న రాఘవేందర్

యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్

కడ్తాల్: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారని యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్ అన్నారు. శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారి అన్మాస్‌పల్లి కూడలిలో ఉప్పరాసికుంటకు వెళ్లే నీటి మార్గం మొత్తం మూసుకుని పోయిందని, చెత్త చెదారంతో నిండిపోయి.. మురికి గుంతగా తయారయిందని అన్నారు. ఈమేరకు శుక్రవారం స్థానికులతో కలిసి రాఘవేందర్ గుంతను పరిశీలించారు. మురుగు కాల్వ వల్ల కంపు వాసన వస్తోందని, సమీపంలోనే పాఠశాల ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయమై స్థానిక ప్రజాప్రతినిధులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని అన్నారు. ఈవిషయమై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్ లక్ష్మికి ఫిర్యాదు చేశారు. వెంటనే చర్యలు తీసుకుని ఉప్పరాశి కుంటలోకి నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.వెంకటేశ్, మహేశ్, రవి, రాజు, విద్యార్థులు ఉన్నారు.

ముదిరాజ్‌ల అభివృద్ధికి సహకరించండి

మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్‌ను కలిసిన యాదగిరి



బండ ప్రకాష్‌ను సన్మానించిన యాదగిరి తదితరులు

తలకొండపల్లి: మండల కేంద్రానికి చెందిన యాదగిరి ఇటీవల ముదిరాజు మండల అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో యాదగిరి.. శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండప్రకాశ్‌ను కలసి సన్మానించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. మత్స్యకారులు గ్రామ సొసైటీలను ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, తగిన సహాయ సహకారాలు అందించాలని కోరారు. డిప్యూటీ చైర్మన్ మాట్లాడుతూ.. తలకొండపల్లి, గట్టుఇప్పలపల్లి, మెదక్‌పల్లి, గ్రామాల్లో సొసైటీలను ఏర్పాటు చేసి త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. తదుపరి యాదయ్య మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాల్లో ముదిరాజ్ సంఘాలను ఏర్పాటు చేసి ప్రతి గ్రామంలో సొసైటీలను ఏర్పాటు చేసి మత్స్యకారుల అభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నర్సింహ, మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, తిరుపతి, జంగయ్య, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు, రేషన్ కార్డులు ఇవ్వండి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కేవీపీఎస్, సీపీఎం నేతలు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం నేతల ధర్నా

ఇబ్రహీంపట్నం: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కేవీపీఎస్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఎం జిల్లా కార్యదర్శి భాస్కర్ మండిపడ్డారు. ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆయన ధర్నా నిర్వహించారు. ఫించన్లు రాక అనేకమంది ఇబ్బందులు పడుతున్నారని, తొమ్మిదేండ్ల నుంచి కొత్త రేషన్‌కార్డులు ఇవ్వడంలేదని, పేర్లు నమోదు కావడంలేదని, ఇంటి స్థలాలు పంపిణీ చేయడంలేదని, రామోజీ ఫిలిం సిటీలో, దండుమైలారంలో 2007లో ఇచ్చిన ఇంటి పట్టాల స్థలాలను చూపించాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సామేల్, జగదీశ్, బుగ్గరాములు, జంగయ్య, స్వప్న, ఎల్లేష్, నర్సింహ, గణేశ్, ముసలయ్య, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ నేతలకు పరామర్శ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ కళాశాల వద్ద జరిగిన ఆందోళన కార్యక్రమంలో అరెస్టై బెయిల్‌పై విడుదలైన ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు యాదయ్యను మాజీ ఎంపీపీ, కాంగ్రెస్ నాయకుడు మర్రి నిరంజన్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. గురునానక్ కళాశాల వద్ద జరిగిన సంఘటన గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మద్దతుగా నిలిచిన నేతలను అభినందించారు.

అండగా ఉంటాం..

గురునానక్ కళాశాల వద్ద జరిగిన తోపులాట, లాఠీచార్జిలో గాయపడిన ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు నందకిషోర్‌ను శుక్రవారం పలువురు పరామర్శించారు. నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నందకిషోర్‌ను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పరామర్శించి అండగా ఉంటామని తెలిపారు.

డ్రగ్స్ సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్ట్

హస్తినాపురం: డ్రగ్స్‌ను సరఫరా చేసేందుకు నగరానికి తీసుకువస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వనస్థలిపురం సీఐ జలేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కేరళ త్రిస్సూర్ జిల్లా వడకంచేరి తాలుకాకు చెందిన చలపురత్ సుమేశ్ (30)డ్రైవర్‌గా పనిచేస్తూ రాజమండ్రిలోని దేవిచౌక్‌లో ఉంటున్నాడు. నిషేధిత 50 గ్రాముల ఎండీఎంఏను బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరలిస్తుండగా ఎల్‌బీనగర్ ఎస్‌ఓటీ పోలీసులు, వనస్థలిపురం పోలీసులు సంయుక్తంగా దాడి చేసి అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి ఎండీఎంఏ 50 గ్రాముల డ్రగ్, రూ.2040 నగదు, మొత్తం రూ.5లక్షల విలువగల వస్తువులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. గతంలో సుమేశ్ గంజాయికి బానిసై గంజాయిని తరలించే క్రమంలో కేసు నమోదు చేయడం జరిగిందని సీఐ వెల్లడించారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



మిల్లెట్స్ టిఫిన్‌లను అందజేస్తున్న సత్తయ్య

డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య

తుర్కయంజాల్: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య అన్నారు. శుక్రవారం తుర్కయంజాల్‌లోని శ్రీరామ్‌నగర్ కాలనీలో చిరుధాన్యాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కౌన్సిలర్ మంగమ్మ, కాంగ్రెస్ నాయకులు శివకుమార్ ఆధ్వర్యంలో ఉచితంగా చిరుధాన్యాలతో చేసిన టిఫిన్‌లను అందజేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, ఫర్టిలైజర్స్ ఉపయోగించి పండించిన పంటలతో చిన్న వయస్సులోనే అనారోగ్య సమస్యలు రావడం పరిపాటిగా మారిందన్నారు. షుగర్, బీపీ, థైరాయిడ్, గుండెపోటు, అధిక బరువు వంటి సమస్యలతో సతమతమవుతున్న వారు చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నయ మిల్లెట్స్ నిర్వాహకులు అమర్ సంకీర్తన రెడ్డి, రఘు, మాజీ సర్పంచ్ దశరథ, నాయకులు రమేష్, శంకర్ పాల్గొన్నారు.

సభ్యులకు సత్వర సేవలు

ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వైస్ చైర్మన్ మూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న మూర్తి

మీర్‌పేట: వాటాదారులకు, సభ్యులకు సత్వర సేవలు అందించడంలో సిటిజన్ సొసైటీ ముందుంటుందని ఆ సొసైటీ వైస్ చైర్మన్ వై.ఎస్.ఆర్. మూర్తి తెలిపారు. మీర్‌పేట కార్పొరేషన్ బాలాపూర్ చౌరస్తాలోని ది సిటిజన్ కో ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ బాలాపూర్ శాఖ వాటాదారుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మూర్తి మాట్లాడుతూ.. సొసైటీ మొత్తం వ్యాపారంలో డిపాజిట్లు రూ.1863 కోట్లు, రుణాలు రూ.160 కోట్ల స్థాయిని అధిగమించిందని అన్నారు. అనంతరం సొసైటీ డైరెక్టర్ సోమలింగం గౌడ్, డైరెక్టర్ మన్‌సాని శ్రీనివాస్, సుబ్బయ్య మాట్లాడుతూ సిటిజన్ సొసైటీ అభివృద్ధి బాటలో పయనిస్తూ, సామాన్య ప్రజల అవసరాలకు బంగారు ఆభరణాలపై ఎక్కువ మొత్తంలో రుణాలు ఇస్తున్నామని చెప్పారు. అదేవిధంగా సొసైటీ ఆరు రాష్ట్రాల్లో శాఖలను విస్తరించి సేవలందిస్తోందన్నారు. సమావేశంలో బాలాపూర్ శాఖ మేనేజర్ మధుమోహన్, సిబ్బంది యాదగిరి గౌడ్, రమాదేవి, మురళి, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిద్దాం

బీజేపీ నేత ఆచారి



ఆమనగల్లు: ప్రజలతో మాట్లాడుతున్న ఆచారి

ఆమనగల్లు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ సీనియర్ నేత ఆచారి సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని గుర్రంగుట్ట కాలనీ, శ్రీకాంత్ కాలనీల్లో శుక్రవారం నిర్వహించిన ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో ఆచారి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం 9 ఏళ్ల పాలనలో సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఆశీర్వదించాలని కోరారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్ దివ్య, పట్టణ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, నాయకులు పాల్గొన్నారు.

సాలార్‌పూర్ గ్రామంలో..

కడ్తాల్: మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామంలో శుక్రవారం బీజేపీ నాయకులు ఇంటింటికి బీజేపీ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని తెలిపారు. అదే విధంగా మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా నాయకులు రవీందర్‌రెడ్డి బీజేవైఎం మండల అధ్యక్షుడు అశోక్‌రెడ్డి, నాయకులు మల్లేశ్, వెంకటేశ్, అంజయ్య, దశరథ్ తదితరులు ఉన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి

తుర్కయంజాల్: డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీ అడుగుజాడల్లో నడవాలని బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రమేష్ పిలుపునిచ్చారు. శుక్రవారం శ్యాంప్రసాద్ ముఖర్జీ అభియాన్ దివస్‌ను పురస్కరించుకుని తుర్కయంజాల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు నర్సింహగౌడ్, నాయకులు శ్రావణ్‌కుమార్, బాబు, సంజీవరెడ్డి, రమేష్, సునీత తదితరులు పాల్గొన్నారు.



శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు